సాక్షి సూర్యాపేట

ఆదివారం, 10, డిసెంబర్, 2023



పదోన్నతులకు 'టెట్' దెబ్బ

టెట్ ఉంటేనే ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్‌లు పదోన్నతులకు అర్హులని ఎన్‌సీటీఈ ఉత్తర్వులు జారీ చేసింది. - 8లో



సాగర్ ప్రాజెక్టుకు 68 ఏళ్లు

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి ఆదివారం నాటికి 68 వసంతాలు పూర్తికానున్నాయి. - 10లో



ముగిసిన ఉర్సు

అర్వపల్లి శివారులోని హజ్రత్ సయ్యద్ ఖాజా నసీరుద్దీన్‌బాబా దర్గా ఉత్సవాలు శనివారం ముగిసాయి. - 10లో

న్యూస్‌రీల్

11 నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడాపోటీలు

మునగాల(కోదాడ): ఉమ్మడి జిల్లాస్థాయిలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు వివిధ క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు సూర్యాపేట జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎండీ అజాంబాబా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం 14, 17సంవత్సరాల బాలబాలికలకు ఉమ్మడి జిల్లాస్థాయిలో క్యారమ్స్, సైక్లింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు గడ్డం వెంకటేశ్వర్లు, ఫిజికల్ డైరెక్టర్, 94944 44870ను సంప్రదించవచ్చని తెలిపారు. మంగళవారం కోదాడ పట్టణంలోని న్యూవిజన్ స్కూల్‌లో రైఫిల్ షూటింగ్ పోటీలు నిర్వహిస్తామని, వివరాలకు పాఠశాల పీఈటీ మైసయ్య 98484 06672ను సంప్రదించాలని పేర్కొన్నారు. అదేరోజు కోదాడ(కొమరబండ)లోని తేజ విద్యాలయంలో సూర్యాపేట జిల్లాస్థాయి చెస్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని, వివరాలకు చెస్ ఇన్‌చార్జ్ పారేపల్లి చంద్రశేఖర్ 94913 29171ను సంప్రదించాలని తెలిపారు. బుధవారం ఉమ్మడి జిల్లా పోటీలను దురాజ్‌పల్లి శివారులోని స్వామి నారాయణ స్కూల్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

లోపాలను సమీక్షించుకుంటాం



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ వైపు నుంచి జరిగిన లోపాలను సమీక్షించుకుని, జరిగిన పొరపాట్లను సరిదిద్దుకుంటామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య పోటీగా ఓటర్లు చూశారు తప్ప మూడవ పార్టీకి అవకాశం ఇవ్వలేదన్నారు. కుటుంబ పాలన, అవినీతి, నిధుల దుర్వినియోగం, స్థానిక ఎమ్మెల్యేలపై ఉన్న వ్యతిరేకత కారణంగా బీఆర్ఎస్ ఓటమిపాలైందన్నారు. సీపీఎం, ప్రజా సంఘాల నుంచి రావాల్సిన ఓట్లను ఎన్నికల్లో నిలబెట్టలేకపోయామన్నారు. ఇది బలహీనతగా గుర్తించాల్సిన అవసరముందన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి, జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పారేపల్లి శేఖర్ రావు, మట్టిపల్లి సైదులు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కోట గోపి, ఏకలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆశాలకు నిర్దిష్ట వేతనం ఇవ్వాలి



మాట్లాడుతున్న నరసింహ

దురాజ్‌పల్లి (సూర్యాపేట): రాష్ట్రంలోని నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న ఆశాలకు రూ.18వేల నిర్దిష్ట వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఆశవర్కర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం సాధించుకుని 9 సంవత్సరాలు అవుతున్నా స్కీం వర్కర్ల జీవితాల్లో మార్పులు రాలేదన్నారు. ప్రస్తుతం వచ్చిన ప్రజా ప్రభుత్వంలో సమస్యలు పరిష్కారమవుతాయని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు తోట రామాంజనేయులు, జిల్లా గౌరవాధ్యక్షుడు చామల అశోక్, సూర్యాపేట డివిజన్ కార్యదర్శి నిమ్మల ప్రభాకర్, ఆశ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ నకిరేకంటి కవిత, కోకన్వీనర్లు హుస్సేని, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

అంధులకు 50 శాతం రాయితీ ఇవ్వాలి

నల్లగొండ టూటౌన్ : 80 నుంచి 100 శాతం అంధత్వం ఉన్న వారికి ఆర్టీసీ బస్సుల్లో 50 శాతం రాయితీ ఇవ్వాలని డ్వాబ్ సంస్థ ప్రధాన కార్యదర్శి పానుగోటి చొక్కారావు శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఉచితాలకు తాను వ్యతిరేకమని, ఉచితాల వల్ల రాష్ట్రం అధోగతి పాలయ్యే అవకాశం ఉన్నందున 80 శాతం అంధత్వం కలిగిన వారికి ఆర్టీసీ బస్సులో టికెట్లపై 50 శాతం రాయితీ ఇవ్వాలని కోరారు.

'మహా' ఆనందం

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం

- జిల్లా కేంద్రంలో సాధారణ ప్రయాణికురాలితో ప్రారంభోత్సవం
- ముఖ్య అతిథులుగా పాల్గొన్న కలెక్టర్ వెంకట్రావ్, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి



ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభోత్సవం సందర్భంగా సూర్యాపేటలోని కొత్తబస్టాండ్‌లో మహిళల సందడి

భానుపురి (సూర్యాపేట): కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీల్లో భాగంగా మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు సదుపాయాన్ని శనివారం లాంఛనంగా ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సు రెండింటినీ ప్రత్యేకంగా అలంకరించారు. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు డిపో నుంచి రాకపోకలు సాగించే మహిళలు పెద్దఎత్తున అక్కడికి చేరుకోవడంతో పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం కలెక్టర్ వెంకట్రావ్, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డితో కలిసి పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన సాధారణ ప్రయాణికులు కర్నాటి సీతారామమ్మతో ప్రత్యేక బస్సును ప్రారంభింపజేశారు.

మహిళలతో కలిసి కలెక్టర్, మాజీ మంత్రి ప్రయాణం

ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం ప్రారంభించిన అనంతరం కలెక్టర్ వెంకట్రావ్, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ప్రత్యేక బస్సులో మహిళలతో కలిసి ప్రయాణించారు. ప్రయాణికులకు స్వీట్లు పంపిణీ చేశారు. వీరితోపాటు ఎంవీఐ సునీత, ఏఎంవీఐ దీప్తిలు ఉన్నారు. బస్సు కొత్త బస్టాండ్ నుంచి ఖమ్మంక్రాస్ రోడ్డు, రాఘవాప్లాజా, వాణిజ్యభవన్ సెంటర్, శంకర్ విలాస్ సెంటర్, గాంధీ విగ్రహం, తెలంగాణ తల్లి విగ్రహం నుంచి తిరిగి కొత్తబస్టాండ్‌కు చేరుకుంది. బస్సు ప్రారంభం కాగానే కండక్టర్ మహిళలతో ఉచిత ప్రయాణానికి సంబంధించిన టికెట్‌ను అందించగా.. మహిళలు ఆనందంతో మురిసిపోయారు.



మహిళలతో కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న కలెక్టర్ వెంకట్రావ్, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

ఆనందంగా ఉంది



కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం సదుపాయాన్ని అమలు చేయడం సంతోషంగా ఉంది. ఏ ప్రభుత్వాలు చేయని విధంగా మహిళలకు ఈ ప్రభుత్వం అండగా ఉంటుందని భావిస్తున్నా.

– కర్నాటి సీతారామమ్మ, సూర్యాపేట

మహిళలకు పెద్దపీట



కాంగ్రెస్ పార్టీ మహిళలకు పెద్దపీట వేస్తూ మంచి నిర్ణయం తీసుకుంది. ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించింది. మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా అధికారంలోకి రాగానే అమలు చేయడం వారి చిత్తశుద్ధిని నిరూపిస్తుంది.

– నాగలక్ష్మి, సూర్యాపేట

బస్సులో టికెట్ తీసుకోలేదు



మాది మునగాల మండలం ముకుందాపురం గ్రామం. నేను శనివారం ఉదయం తిరుమలగిరికి ఆర్టీసీ బస్సులో వెళ్లాను. కండక్టర్ చార్జీ తీసుకున్నాడు. తిరుగు ప్రయాణంలో మళ్లీ బస్సు ఎక్కాను. కానీ కండక్టర్ టికెట్ తీసుకోలేదు, నేటి నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో చార్జీలు లేవని చెప్పాడు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం అమలులోకి రావడం చాలా ఆనందంగా ఉంది.

– బొబ్బిలి పద్మ, ముకుందాపురం, మునగాల మండలం



సూర్యాపేట కొత్తబస్టాండ్ వద్ద బస్సులో ప్రయాణిస్తున్న మహిళలు

మహిళా సాధికారతకు మొదటి అడుగు

- కలెక్టర్ వెంకట్రావ్

మహాలక్ష్మి పథకం మహిళా సాధికారతకు తొలి అడుగని కలెక్టర్ వెంకట్రావ్ అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డితో కలసి మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. సూర్యాపేటకు ఎక్స్‌ప్రెస్ బస్సులు 45, పల్లె వెలుగు 62, కోదాడకు ఎక్స్‌ప్రెస్ 18, పల్లె వెలుగు 40.. మొత్తం 165 బస్సులు ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఉచిత ప్రయాణ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీవీఎం శివశంకర్, డీఎం సురేందర్, ఏఎం టీ నాగశ్రీ పాల్గొన్నారు.

రాజీవ్ ఆరోగ్యశ్రీ పేదలకు వరం

- కలెక్టర్ వెంకట్రావు



ఆరోగ్యశ్రీ పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్, మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి

సూర్యాపేట: రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పేదలకు వరమని కలెక్టర్ వెంకట్రావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో ఈ పథకాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్య శ్రీ ద్వారా రూ.10లక్షల వైద్య సహాయం అందనుందని తెలిపారు. అర్హులైన ప్రతిఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్‌లలో పనిచేస్తున్న వైద్యులకు ప్రత్యేక శిక్షణ కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఆరోగ్యశ్రీ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ కోటాచలం, ఆస్పత్రి పర్యవేక్షకులు మురళీధర్ రెడ్డి, డీఐఓ వెంకటరమణ, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

హరిహరులకు సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శనివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. నిత్య కల్యాణ వేడుకను వైభవంగా నిర్వహించారు. అంతకుముందు వేకువజామున శ్రీస్వామి, అమ్మవార్లకు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన చేశారు. అదేవిధంగా ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం జోడు సేవలను మాఢవీధిలో ఊరేగించారు.

తెలంగాణకు బాటలు వేసిన సోనియమ్మ



సోనియాగాంధీ జన్మదిన వేడుక సందర్భంగా కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

- మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

భానుపురి (సూర్యాపేట): స్వరాష్ట్ర కలను సాకారం చేసి, సకల జనుల జీవితాల్లో వెలుగులు నింపి తెలంగాణకు బాటలు వేసిన నాయకురాలు సోనియమ్మ అని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోనియాగాంధీ రెండుసార్లు ప్రధాన మంత్రిగా అవకాశం వచ్చినా పదవి చేపట్టలేదన్నారు. యూపీఏ జాతీయ సలహా సంఘం అధ్యక్షురాలిగా, జాతీయ గ్రామీణ ఉపాధి పథకం, సమాచార హక్కు చట్టాల అమలులో ముఖ్యపాత్ర పోషించారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు వేణారెడ్డి, చకిలం రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు మంత్రులకు ప్రధాన శాఖలు

- ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ
- కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి రోడ్లు, భవనాలు
- మంత్రులకు శాఖల కేటాయింపు
- రోడ్ల మరమ్మతుపై ప్రజల్లో చిగురిస్తున్న ఆశలు



ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులకు ప్రభుత్వం శనివారం శాఖలను కేటాయించింది. నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖలను కేటాయించింది. ఇద్దరికి రెండు చొప్పున శాఖల కేటాయింపు జరిగింది. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గతంలో గృహ నిర్మాణ శాఖ మంత్రిగా పనిచేయగా.. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఐటీ శాఖను నిర్వహించారు.

రోడ్ల మరమ్మతులకు మోక్షం!

నల్లగొండ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రోడ్లు భవనాల శాఖ మంత్రి కావడంతో జిల్లాలో రోడ్లకు మహర్దశ పట్టనుందని ప్రజలు భావిస్తున్నారు. రాష్ట్రంలో కొన్ని సంవత్సరాల నుంచి రోడ్డు భవనాల శాఖకు నిధుల కేటాయింపు అంతంతమాత్రంగానే జరుగుతోంది. వర్షాలకు జిల్లాలో రోడ్లు దెబ్బతిన్నాయి. ఆ రోడ్ల మరమ్మతుల విషయంలో జిల్లా అధికారులు ప్రభుత్వానికి దాదాపు 50 వరకు ప్రతిపాదనలు పంపించారు. వాటి మరమ్మతుకు రూ.650 కోట్లు అవసరముందని ప్రభుత్వానికి ప్రతిపాదించారు. అయితే, ప్రభుత్వం అందులో 15 ప్రతిపాదనలకు సంబంధించి రూ.110 కోట్లు మాత్రమే మంజూరు చేసింది. రోడ్ల మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో అవి మరింతగా దెబ్బతిన్నాయి. మరోవైపు జిల్లాలో చేపట్టిన రోడ్లు, భవనాలకు సంబంధించి దాదాపు రూ.100 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది.

పెట్టుబడి సాయమెంత?

- రూ.5వేలు ఇస్తారా లేక రూ.7,500 ఇస్తారా అనే సందిగ్ధంలో రైతులు
- ఇప్పటికే ప్రారంభమైన యాసంగి సీజన్
- పెట్టుబడి సాయం కోసం ఎదురుచూపులు
- జిల్లాలో 2.67 లక్షల మంది రైతులు



దురాజ్‌పల్లి (సూర్యాపేట) : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీ పథకాలను అమలుచేసి తీరుతామని, అందులో రైతుభరోసా కింద పెట్టుబడి సాయం ఎకరానికి రూ.7,500 చొప్పున ఏడాదికి రూ.15వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. ప్రస్తుతం యాసంగి సీజన్ ప్రారంభమైంది. రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారు. అయితే కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయంపై నేటికీ స్పష్టత లేదు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన విధంగా ఎకరానికి రూ.5 వేలు ఇస్తారా లేక రూ.7500 ఇస్తారా అని రైతులు చర్చించుకుంటున్నారు.

2014లో ప్రారంభమైన రైతుబంధు

బీఆర్ఎస్ ప్రభుత్వం 2014 అసెంబ్లీ ఎన్నికలకు ముందు రైతుబంధు పథకాన్ని ప్రకటించింది. అప్పుడు ఎకరానికి రూ.4వేల చొప్పున రెండు సీజన్‌లకు ఎకరానికి రూ.8వేల పెట్టుబడి సాయాన్ని అందించింది. రెండోసారి అధికారంలోకి వచ్చాక కేసీఆర్ దానిని ఎకరాకు రూ.5వేలకు పెంచారు. రెండు సీజన్లలో ఎకరాకు రూ.10వేల చొప్పున అందించారు. గత నెలలో యాసంగి సీజన్ ప్రారంభం కావడంతో రైతుబంధు సొమ్ము ఎకరానికి రూ.5వేల చొప్పున జమ చేసేందుకు నిర్ణయం తీసుకుంది. అయితే ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఈసీ రైతుబంధును నిలిపివేసింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈనెల 7న రేవంత్‌రెడ్డి సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడంతో పాటు ఆరు గ్యారంటీ పథకాల అమలుపై సంతకం చేశారు. ఈనెల 9న మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించారు. ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్య సేవల ఖర్చు సాయాన్ని రూ.10లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. కాగా.. యాసంగి వ్యవసాయ పనులు ఊపందుకుంటున్నాయి. ఈక్రమంలో రైతులు పెట్టుబడి సొమ్ము కోసం ఎదురుచూస్తున్నారు. పెట్టుబడి సాయం కింద ఎకరానికి రూ.5వేలు ఇస్తారా లేక రూ.7,500 ఇస్తారా అని రైతుల్లో సందిగ్ధం నెలకొంది. రైతు భరోసాపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

పెరిగిన లబ్ధిదారుల సంఖ్య

గతంలో జిల్లాలో 2.67లక్షల మంది రైతులకు ఎకరాకు రూ.5వేల చొప్పున రూ.310కోట్ల పెట్టుబడి సాయం అందేది. ఇప్పుడు రూ.7500లకు పెంచడంతో నిధులు పెరిగే అవకాశం ఉంది. అంతేకాకుండా భూముల క్రయవిక్రయాలు జరగడంతో వాటికి సంబంధించిన పాస్‌పుస్తకాల్లో మార్పులు, చేర్పులు చోటుచేసుకున్నాయి. ఇలా జిల్లాలో సుమారు మరో 11వేల మంది రైతులకు ఈ సీజన్‌లో అదనంగా రైతుబంధు అందాల్సి ఉంది. ఇదిలా ఉంటే రైతులందరికీ రైతుబంధు ఇస్తారా.. లేక కొన్ని ఎకరాల వరకే కటాఫ్ పెట్టే అవకాశం ఉన్నదా అనేది తెలియాల్సి ఉంది.

12న స్వరనీరాజనం

భానుపురి (సూర్యాపేట): శ్రీజ్ఞాన సరస్వతి సాంస్కృతిక కళావేదిక ఆధ్వర్యంలో 12వ తేదీన సాయంత్రం 6గంటలకు స్థానిక కిరాణా అండ్ ఫ్యాన్సీ మర్చంట్ అసోసియేషన్ భవనంలో ఘంటసాల స్వర నీరాజనం నిర్వహిస్తున్నట్లు వేదిక అధ్యక్షుడు బుర్రి వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం స్వరనీరాజనం ఆహ్వాన పత్రికను డీఎస్పీ నాగభూషణానికి అందజేశారు. వేదిక ప్రధాన కార్యదర్శి, విశ్రాంత రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గుండా రమేష్, మాట్లాడుతూ సంగీత విభావరికి కవులు, రచయితలు, గాయకులు, కళాకారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వేదిక సభ్యులు శ్రీనివాస్ అరవింద్ శర్మ పాల్గొన్నారు.

ఒకే చోట స్కూళ్ల సమాచారం

- యూడైస్ ప్లస్‌లో పాఠశాలల వివరాలు నమోదు
- దీనిపై ప్రధానోపాధ్యాయులకు శిక్షణ
- వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు

హుజూర్‌నగర్: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల సమగ్ర సమాచారం ఇకనుంచి ఒకేచోట నమోదు కానుంది. యూడైస్ ప్లస్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్‌ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్)ను 2024 – 25 విద్యాసంవత్సరం నుంచి పగడ్బందీగా అమలు చేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ నెలాఖరులోగా పాఠశాలలు, విద్యార్థులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని సేకరించేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. సంబంధిత వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు.

పేరు ఉంటేనే విద్యార్థులకు సౌకర్యాలు

యూడైస్ ప్లస్‌లో పేరు, వివరాలు ఉన్న విద్యార్థులకు మాత్రమే అల్పాహారం, మధ్యాహ్న భోజనం, యూనిఫాం, పుస్తకాలు తదితర వాటిని అందిస్తారు. దీనికి సంబంధించిన ప్రతి పేరును ప్రధానోపాధ్యాయులు ఆన్‌లైన్‌లో నమోదుచేయాల్సి ఉంటుంది. డిసెంబరు నెల చివరి నాటికి అన్ని వివరాలు పంపించాలని ఇప్పటికే అధికారులు ఆదేశాలు జారీ చేశారు.



హెచ్‌ఎంలకు శిక్షణ ఇస్తున్న రిసోర్స్‌పర్సన్

జిల్లాలో 1,39,184 మంది విద్యార్థులు

జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 710, ప్రాథమికోన్నత పాఠశాలలు 178, ఉన్నతపాఠశాలలు 383 ఉన్నాయి. ఇవేకాకుండా వివిధ సొసైటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీలు ఉన్నాయి. వాటిలో 1 నుంచి 12వ తరగతి వరకు మొత్తం 1,39,184 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరందరి సమాచారం మొత్తం కూడా యూడైస్ ప్లస్‌లో నమోదు చేయనున్నారు.

అదనపు సమాచారం

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్, గురుకులాలు, కస్తూర్బా, ఆదర్శ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలు ఇదివరకే నమోదు చేశారు. దీనికి మరిన్ని వివరాలు జోడించి కొన్ని మార్పులు చేయనున్నారు. తరగతి గదులు, మురుగు దొడ్లు, తాగు నీరు, మౌలిక వసతుల సమాచార వివరాలను నమోదు చేస్తారు. నిధులు విడుదల చేసేందుకు ఈ విధానం ఎంతో తోడ్పనుందని అధికారులు భావిస్తున్నారు.

శిక్షణ ఇస్తున్నాం



యూడైస్ ప్లస్‌లో పాఠశాలలు, విద్యార్థుల వివరాలు పకడ్బందీగా నమోదు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. ఆయా వివరాల నమోదుపై ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నాం. ఈ విధానంతో అన్ని పాఠశాలల వివరాలు ఒకే దగ్గర ఉంటాయి.

– సైదా నాయక్, ఎంఈఓ, హుజూర్‌నగర్

మూడంచెల విధానంలో పరిశీలన

యూడైస్‌లో నమోదైన వివరాలను మూడంచెల విధానంలో పరిశీలించనున్నారు. ఈ నెల 14లోపు ప్రధానోపాధ్యాయులు పాఠశాలల వివరాలు నమోదు పూర్తి చేయాల్సి ఉంటుంది. నమోదు చేసిన వివరాలు సక్రమంగా ఉన్నాయా, లేవా అనే విషయాలను స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పరిశీలించి ఎంఈఓలకు నివేదిక అందజేస్తారు. అందులో 25 శాతం పాఠశాలలను మండల విద్యాధికారులు పరిశీలన చేస్తారు. అనంతరం జిల్లా విద్యాధికారి 10 శాతం పాఠశాలలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తారు.

క్లుప్తంగా

ప్రమాణ స్వీకారానికి హాజరు కాని ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ: వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నందున అసెంబ్లీలో ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శాసనసభ ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారానికి హాజరు కాలేకపోయానని మిర్యాలగూడ ఎమ్మెల్యే బీఎల్ఆర్ శనివారం పేర్కొన్నారు. ఆదివారం తన తల్లి పెద్ద కర్మ ఉన్నందున రాలేకపోయానని తెలిపారు. కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడుతున్నందున ఎవరినీ కలవలేకపోయానని, ఈనెల 16 నుంచి నియోజకవర్గంలోని ప్రతి నాయకుడు, కార్యకర్తను ప్రత్యేకంగా కలుస్తానని ఆయన తెలిపారు. ఈ రెండు, మూడు రోజుల్లో స్పీకర్ సమక్షంలో బీఎల్ఆర్ ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేయనున్నట్లు తెలిసింది.

తాళం వేసిన ఇంట్లో చోరీ

అడవిదేవులపల్లి : గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. అడవిదేవులపల్లి మండల కేంద్రానికి చెందిన మాడిశెట్టి వాసుదేవి ముదిమాణిక్యం గ్రామంలో రేషన్ డీలర్‌గా పనిచేస్తుంది. వాసుదేవి శుక్రవారం తన భర్త నాగభూషణంతో కలిసి ముదిమాణిక్యం గ్రామానికి వెళ్లింది. అక్కడ ఆలస్యం కావడంతో బంధువుల ఇంటి వద్దనే ఉన్నది. శనివారం ఉదయం తిరిగి రావడంతో ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉండటంతో స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించగా వచ్చి పరిశీలించారు. బాధితురాలి చెవి దిద్దులు, ఉంగరం, చెవి కమ్మలతో పాటు కొంత నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. పోలీసులు క్లూస్ టీంను రప్పించి వెలిముద్రలను సేకరించారు. మిర్యాలగూడ రూరల్ సీఐ ముత్తినేని సత్యనారాయణ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరిబాబు తెలిపారు.

ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య

చౌటుప్పల్ : ఉరేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన చౌటుప్పల్ మండల పరిధిలోని జైకేసారం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. జైకేసారం గ్రామానికి చెందిన బండమీది పవన్(18) చౌటుప్పల్ మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఒకేషనల్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం రాత్రి పడుకునే వరకు ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసే ఉన్నాడు. ఆ క్రమంలో గ్రామంలోని ఓ వ్యక్తి వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని శనివారం ఉదయం స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. యువకుడి మృతికి గల కారణాలు తెలియరాలేదు. మృతుడి బాబాయి సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఎస్.దేవేందర్ తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

చౌటుప్పల్ : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. జనగామ జిల్లా దేవరుప్పల గ్రామానికి చెందిన నూకల నర్సింహ (50) 25ఏళ్ల క్రితం జీవనోపాధి నిమిత్తం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల పరిధిలోని తూప్రాన్‌పేట గ్రామానికి వచ్చాడు. కుటుంబ సభ్యులతో కలిసి అదే గ్రామంలో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం సాయంత్రం తూప్రాన్‌పేటలోని జాతీయ రహదారి దాటుతుండగా హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు అర్ధరాత్రి మృతిచెందాడు. అంత్యక్రియల నిమిత్తం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని చౌటుప్పల్ సీఐ ఎస్.దేవేందర్ తెలిపారు.

- ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం



అసెంబ్లీలో ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం చేస్తున్న పద్మావతి, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, నేనావత్ బాలునాయక్, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మందుల సామేలు, వేముల వీరేశం, కుందూరు జయవీర్‌రెడ్డి, బీర్ల అయిలయ్య

పదోన్నతులకు 'టెట్' దెబ్బ

- టెట్ అర్హత ఉన్న ఉపాధ్యాయులకే పదోన్నతులు
- తాజాగా ఉత్తర్వులు జారీ చేసిన ఎన్‌సీటీఈ
- ఆందోళన వ్యక్తం చేస్తున్న సీనియర్ ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు



సూర్యాపేటటౌన్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష ఉంటేనే ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్‌లు పదోన్నతులకు అర్హులని తాజాగా ఎన్‌సీటీఈ (నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్) ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సీనియర్ ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్‌లు టెట్ అర్హత లేకపోవడంతో పదోన్నతులకు దూరమయ్యే అవకాశం ఉంది. ఎన్‌సీటీఈ ఉత్తర్వులు 2010 సంవత్సరం తర్వాత నియామకమైన జూనియర్ ఉపాధ్యాయులకు మేలు చేయనుండగా.. ఏళ్లుగా పనిచేస్తున్న సీనియర్ ఉపాధ్యాయులను పదోన్నతులకు దూరం చేస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు.

అక్టోబర్‌లో నిలిచిన బదిలీల ప్రక్రియ

ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీల ప్రక్రియ అక్టోబర్ మొదటివారంలో నిలిచిపోయింది. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులతో 1800 మంది ఎస్జీటీల బదిలీలు ఆగిన సంగతి తెలిసిందే. వాస్తవానికి తొలుత జీహెచ్ఎంల బదిలీలు, అనంతరం స్కూల్ అసిస్టెంట్‌లకు హెచ్ఎంలుగా పదోన్నతులు కల్పించాలి. అయితే, సూర్యాపేట జిల్లాలో 71 మంది జీహెచ్ఎంలు బదిలీ అయ్యారు. ఆ తర్వాత సుమారు ప్రభుత్వ పాఠశాలల పరిధిలో 40 మంది స్కూల్ అసిస్టెంట్‌లకు బదిలీలు సైతం పూర్తయ్యాయి. పదోన్నతులు లేకపోవడంతో బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్‌ల స్థానంలో రిలీవర్ లేక చాలా మంది ఇప్పటికీ కొందరు ఇదివరకు పనిచేస్తున్న పాఠశాలల్లోనే విధులు నిర్వహిస్తున్నారు. అయితే జెడ్పీ పరిధిలో సుమారు 200 మందికి పైగా స్కూల్ అసిస్టెంట్‌లు పదోన్నతులకు అర్హులుగా ఉన్నారు. తాజాగా ఈ ఉత్తర్వులు రావడంతో 2,010 ముందు ఉపాధ్యాయులకు పదోన్నతులు దూరం కానున్నాయి.

సీనియర్లలో అయోమయం

ఇది వరకు పదోన్నతుల జాబితాలో 1996 డీఎస్సీ మొదలుకొని 2,010 డీఎస్సీ వరకు నియామకమైన వారే అత్యధికులు ఉన్నారు. ఇప్పుడు ఎన్‌సీటీఈ ఉత్తర్వులతో జాబితా పూర్తిగా మారిపోనుంది. ఇందులో 2012 నుంచి 2017 డీఎస్సీల్లో నియామకమైన వారికే చోటు దక్కనుంది. టెట్ అర్హత లేని వారికి పదోన్నతులు ఎలా ఇస్తారని కొందరు కోర్టు మెట్లు ఎక్కడంతో అప్పట్లో ఎస్జీటీల పదోన్నతులు ఆగిపోయాయి. ఇప్పుడు ఎన్‌సీటీఈ ఉత్తర్వులు టెట్ అర్హత కలిగిన వారికి మేలు చేస్తుండటంతో ఆ అర్హత లేనివారిలో అయోమయం నెలకొంది.

సీనియర్లకు నష్టం



సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు ఇప్పటి వరకు ప్రభుత్వం టెట్ అర్హత అవసరం లేదని చెప్పింది. ఇన్ సర్వీస్‌లో ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా మూడు నెలల్లో టెట్ నిర్వహించి, క్వాలిఫై అయిన వారికి ప్రమోషన్లు కల్పించాలి. మొత్తం కొత్తవారికి అవకాశం ఇస్తే సీనియర్ ఉపాధ్యాయులకు నష్టం జరుగుతుంది.

– రేపాక లింగయ్య, డీటీఎఫ్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు

మూడు నెలలకోసారి టెట్ నిర్వహించాలి



ప్రతి మూడు నెలలకోసారి టెట్ నిర్వహించాలి. టెట్ అర్హతతో చేస్తే 1996 నుంచి ఉన్న వాళ్లకు ప్రమోషన్లు రావు. 2012 తర్వాత ఉన్నోళ్లకు మాత్రమే వస్తాయి. సీనియర్లకు అన్యాయం జరుగుతుంది. మూడు నెలలకోసారి టెట్‌కు అవకాశం కల్పించాలి.

– సీహెచ్.రామలింగారెడ్డి, పీఆర్‌టీయూ సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి

ఎన్‌సీటీఈ ఉత్తర్వులతో మేలు



మేమంతా టెట్ అర్హత సాధించి, డీఎస్సీ రాసి ఉపాధ్యాయులుగా నియామకమయ్యాం. అయినా మాలో చాలా మంది పదోన్నతి అవకాశం లభించలేదు. తాజాగా టెట్ అర్హత ఉన్న వారికే ప్రమోషన్‌లకు అర్హులని ఎన్‌సీటీఈ చెప్పడం హర్షణీయం.

– లక్కపాక ప్రవీణ్‌కుమార్, సీపీఎస్ ఉద్యోగుల సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు

క్రీడలను స్ఫూర్తిగా తీసుకుని ఎదగాలి

- గురుకుల విద్యాలయాల సహాయ కార్యదర్శి సుక్రునాయక్
- రాజాపేటలో 'గురుకుల' రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

రాజాపేట : విద్యార్థులు క్రీడలను స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని గురుకుల విద్యాలయాల సహాయ కార్యదర్శి సుక్రునాయక్ సూచించారు. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల 2023–24వ విద్యా సంవత్సరం రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలు ఆ సంస్థ ఆధ్వర్యంలో శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల ఆవరణలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఆ సంస్థ సహాయ కార్యదర్శి సుక్రునాయక్, ఎస్‌డీసీసీ చైర్మన్ అనురాధ, ఎంపీపీ బాలమణి, సర్పంచ్ ఈశ్వరమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ జ్యోతి హాజరై జ్యోతిప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన గురుకుల విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సింహాచారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నల్లగొండ ప్రాంతీయ సమన్వయ అధికారిణి అరుణకుమారి, యాదాద్రి జిల్లా అధికారులు రజని, శ్రీరామ్ శ్రీనివాస్, ఉదయ్ భాస్కర్, శ్రీనివాస్, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, పీడీలు, పీఈటీలు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గురుకుల విద్యాలయాల సహాయ కార్యదర్శి సుక్రునాయక్



మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న విద్యార్థులు

నార్కట్‌పల్లిలో సినీఫక్కీలో చోరీ

- రైతు వద్ద రూ.2.25లక్షలు కాజేసిన దుండగులు

నార్కట్‌పల్లి : గుర్తుతెలియని వ్యక్తులు నార్కట్‌పల్లిలో ఓ రైతు వద్ద సినీఫక్కీలో నగదును చోరీ చేసిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. నార్కట్‌పల్లి మండలం చిన్నతుమ్మాగూడెం గ్రామ పంచాయతీ పరిధి ఆవులోనిబావి గ్రామానికి చెందిన కన్నెబోయిన యాదయ్య ఖాతాలోని ధాన్యం డబ్బులు తీసుకునేందుకు శుక్రవారం నార్కట్‌పల్లి ఎస్‌బీఐ బ్యాంకుకు వచ్చాడు. తన ఖాతాలోని రూ.2.25లక్షల నగదును డ్రా చేసి కవర్‌లో పెట్టుకుని నడుచుకుంటూ బయలుదేరాడు. ఈ క్రమంలో ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు యాదయ్యను అనుసరించారు. కొద్ది సేపటి తర్వాత షర్ట్, దోవతిపై ఎవరో ఉమ్మివేశారని యాదయ్యకు తెలిపారు. అతను ఓ హోటల్‌లోకి వెళ్లి నగదు ఉన్న కవర్‌ను కుర్చీలో పెట్టి కడుక్కుంటున్నాడు. ఈ క్రమంలో నగదు ఉన్న కవర్‌ను దుండగులు అపహరించుకుపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదాబాబు తెలిపారు.

రెండు రోజుల్లో నిశ్చితార్థం.. అంతలోనే మృతి



నరేశ్‌నాయక్ (ఫైల్)

తుర్కపల్లి: రెండు రోజుల్లో నిశ్చితార్థం జరగాల్సిన యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగిన ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. తుర్కపల్లి మండలం ములకలపల్లి పంచాయతీ పరిధి కీమ్యాతండాకు చెందిన రమావత్ రాములు, లక్ష్మి దంపతులకు ముగ్గురు సంతానం. వీరిలో రెండో కుమారుడు రమావత్ నరేశ్‌నాయక్ (23) ఎల్లిగడ్డ, ఉల్లిగడ్డ అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం తెల్లవారుజాము 2గంటల నుంచి తండాలో కరెంట్ లేదు. కారణం తెలుసుకునేందుకు నరేశ్‌నాయక్ ఉదయం తండా పక్కనే ఉన్న సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లాడు. అక్కడ నరేశ్‌నాయక్ కాలు ఎర్త్ వైర్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. నరేశ్‌నాయక్‌కు సోమవారం నిశ్చితార్థం జరగాల్సి ఉండడంతో కుటుంబ సభ్యులు ఇంట్లో ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ తరుణంలో నరేశ్‌నాయక్ మృతిచెందడంతో కుటుంబంలో విషాదం అలుముకుంది.

మృతదేహంతో ఆందోళన

నరేశ్‌నాయక్ మృతికి విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, తండావాసులు మృతదేహంతో తుర్కపల్లి సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. కొన్ని రోజుల క్రితమే ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేస్తే ప్రమాదం ఎలా జరిగిందని నిలదీశారు. ఇందులో విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం కనిపిస్తోందని, బాధ్యులపై చర్యలు తీసుకుని మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు పోలీసులు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు.

ఆరోగ్య శ్రీని సద్వినియోగం చేసుకోవాలి

సాక్షి యాదాద్రి : మహాలక్ష్మి, చేయూత పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని యాదాద్రి కలెక్టర్ హనుమంతు కె.జెండగే కోరారు. శనివారం భువనగిరిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రి వద్ద ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10లక్షలకు పెంపు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కార్యక్రమాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పరిమితి గతంలో రూ.5 లక్షలు ఉండగా ఇప్పుడు రూ.10 లక్షలకు ప్రభుత్వం పెంచిందన్నారు. ఆరోగ్యశ్రీకార్డు ఉన్నవారు ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు గుర్తింపు పొందిన ప్రైవేట్ హాస్పిటళ్లలో కార్పొరేట్ వైద్యం పొందవచ్చన్నారు.

బస్సులో ప్రయాణించిన కలెక్టర్

మహాలక్ష్మి పథకంలో భాగంగా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రారంభించిన కలెక్టర్.. జిల్లా కేంద్ర ఆస్పత్రి నుంచి భువనగిరి బస్టాండ్ వరకు మహిళలు, అధికారులతో కలిసి బస్సులో ప్రయాణించారు. ఇదిలా ఉండగా మహిళలకు మాత్రమే ఉచిత ప్రయాణానికి అవకాశం ఉండడంతో కండక్టర్ వద్ద కలెక్టర్ టికెట్ కొని ప్రయాణం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, యాదాద్రి ఆలయ ఈఓ గీతారెడ్డి, యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్ గౌడ్, మహిళా శిశు సంక్షేమ అధికారి అన్నపూర్ణ, డీటీఓ సురేందర్‌రెడ్డి, డీఎంహెచ్ఓ పరిపూర్ణాచారి, జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్ చిన్నానాయక్, యాదగిరిగుట్ట డీఎం శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మరియగిరి మహోత్సవం



రామగిరి(నల్లగొండ) : నల్లగొండ పట్టణంలోని మరియగిరి పుణ్యక్షేత్రం మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి కార్డినల్ పూల అంథోని ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మరియగిరి రెక్టర్ రెవరెండ్ జోసెఫ్‌రెడ్డి, రెవరెండ్ శ్రవణ్‌కుమార్, దాసరి శౌరిరాజు, పసల బాలశౌరి, రామినేని కిరణ్, గాలి బాలశౌరి రెడ్డి, గాలి జోజి, మక్కెన ఆరోగ్య రాజు తదితరులు పాల్గొన్నారు.



భక్తురాలికి ఆశీర్వచనం చేస్తున్న కార్డినల్ పూల ఆంథోని



ప్రార్థనలు చేస్తున్న కార్డినల్ పూల ఆంథోని, ఫాదర్ జోసఫ్ రెడ్డి



ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు

చెరువులో దూకి యువకుడి గల్లంతు

బీబీనగర్: యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలోని జాతీయ రహదారి వెంట ఉన్న పెద్ద చెరువులో శనివారం ఓ యువకుడు దూకి గల్లంతయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సుమారు 30సంవత్సరాలు కలిగి ఉన్న యువకుడు మధ్యాహ్న సమయంలో చెరువు వద్దకు చేరుకున్నాడు. స్థానికులు కట్టపై ఉండగానే చెరువు ముందు భాగంలో గల గేట్ వాల్ ట్యాంక్ వద్దకు వెళ్లి నీళ్లలోకి దుకాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది, మత్స్యకారులుతో కలిసి చెరువు వద్దకు చేరుకున్నారు. అతడి కోసం సాయంత్రం నుంచి గాలించినా ఆచూకీ లభించలేదు. చీకటి పడడంతో పోలీసులు గాలింపు చర్యలు నిలిపివేశారు. మండల కేంద్రంలోని పెద్ద చెరువులోకి దూకిన యువకుడు హైదరాబాద్ సమీపంలోని చెంగిచర్ల ప్రాంతానికి చెందిన వాడుగా అనుమానిస్తున్నారు.

వరికొయ్యలు కాల్చితే ముప్పే

- భూసారం కోల్పోయి తగ్గనున్న దిగుబడి
- కాలుష్యం కానున్న వాతావరణం
- పొలాన్ని కలియ దున్నితేనే పంటలకు మేలు

మునుగోడు : వానాకాలం సీజన్‌లో వరి పంటలు సాగు చేసిన రైతులు కూలీల కొరతతో వ్యవసాయంలో యంత్రాలను ఆశ్రయిస్తున్నారు. వరికోతలకు హార్వెస్టర్లను విరివిగా వినియోగిస్తుండడంతో గడ్డి వినియోగం తగ్గిపోయింది. పశువులు ఉన్న రైతులు వరిగడ్డిని నిల్వ చేసుకుంటుండగా, పశువులు లేని పలువురు రైతులు వాటిని పొలాల్లో అలాగే వదిలేస్తున్నారు. తదుపరి పంటకు పొలాన్ని సిద్ధం చేసే క్రమంలో వరికొయ్యలతో పాటు వరిగడ్డికి నిప్పు పెడుతున్నారు. రైతులు అవగాహన లోపంతో చేస్తున్న ఈ చర్యతో భూసారానికి ముప్పు పొంచి ఉందని, ఆ గడ్డి, వరి కొయ్యలను కాల్చివేయకుండా కలియ దున్నితే అనేక ప్రయోజనాలు ఉంటాయని వ్యవసాయ అధికారులు చెప్తుతున్నారు.



మునుగోడులోని ఓ రైతు తన పొలంలో గడ్డిని కాల్చివేస్తున్న దృశ్యం

కాల్చితే జరిగే నష్టాలు..

- వరికొయ్యలను కాల్చివేస్తే నేలకు మేలు చేసే క్రిమి కీటకాలు నశించడంతో పాటు భూసారం అధికంగా తగ్గిపోతుంది.
- వరికొయ్యలు కాల్చడంతో వాతవరణ సమతుల్యం దెబ్బతింటుంది.
- విపరీతమైయిన వేడితో భూసారం కోల్పోతుంది.
- ప్రధానంగా నత్రజని, పాస్పరస్ లాంటి పోషక పదార్థాల శాతం తగ్గి దిగుబడిపై ప్రభావం చూపుతుంది.

పాడి పంట

- భూమికి పీచు పదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కాలిపోతాయి.
- పంటలకు అవసరమయ్యే ఖనిజ లవణాలు దెబ్బతింటాయి.
- పొలాల్లో తిరిగే పాములు, ముంగీసలు, ఉడుములు, తొండలు అనేక రకాల జీవరాశులు చనిపోయే ప్రమాదం ఉంది.

కలియ దున్నితే కలిగే ప్రయోజనాలు..

- వరి కొయ్యలు నేలలో కలియదున్నడంతో సేంద్రియ కర్బన శాతం పెరిగి దిగుబడులు 5నుంచి 10శాతం పెరిగే అవకాశం ఉంది.
- దుక్కి దున్నే సమయంలో సూపర్ పాస్పేట్ చల్లితే అవశేషాలు రెండు వారాల్లో మురిగి పోషకాలుగా అందుబాటులోకి వస్తాయి. ఫలితంగా డీఏపీ వాడకం సగం వరకు తగ్గుతుంది.
- కలియ దున్నడతో ఎకరాకు సుమారు టన్ను ఎరువు తయారవుతుంది.
- మొక్కలకు 2 శాతం నత్రజని, 4 శాతం పాస్పరస్ అదనంగా అందివస్తుంది.
- నీటి నిల్వ పెరుగుతుంది.
- కొయ్యకాళ్లను భూమిలో కలియ దున్నితే గడ్డి ద్వారా పోషకాలు తిరిగి నేలకు చేరుకుంటాయి.

మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోతాయి



కొయ్యకాళ్లను తగలబెట్టడంతో వరి పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు, సేంద్రియ కర్బనం తగ్గిపోతాయి. దీంతో భూసారం తగ్గి దిగుబడి భారీగా పడిపోతుంది. కొయ్యకాళ్లను భూమిలో కలియ దున్నడంతో సేంద్రియ కర్బనం పెరిగి భూసారం అధికమై పంటల దిగుబడి పెరుగుతుంది. నీటి నిల్వ సామర్థ్యం కూడా పెరుగుతుంది. ప్రతి రైతు తమ పొలంలోని కొయ్యకాళ్లను తలబెట్టకుండా పొలంలోనే కలియ దున్నుకోవాలి.

– ఎస్. శ్రీనివాస్‌గౌడ్, వ్యవసాయ అధికారి, మునుగోడు